ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
రాజన్న సిరిసిల్ల జిల్లా వార్తలు
5★★★
సోమవారం 8 డిసెంబరు 2025





- సోషల్ మీడియాలో ప్రచార జోరు
- పంచాయతీ ఎన్నికల్లో వాల్‌రైటింగ్, బ్యానర్లు దూరం
- వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లో 'పంచాయతీ'
- జిల్లాలో మొదటి, రెండో విడతల్లో జోరందుకున్న ప్రచారం
- మొదటి విడతలో సర్పంచ్ అభ్యర్థులు 295 మంది, వార్డు అభ్యర్థులు 1377 మంది
- రెండో విడతలు సర్పంచ్ అభ్యర్థులు 279 మంది, వార్డు అభ్యర్థులు 1296 మంది
- తుది విడతలో సర్పంచ్ అభ్యర్థులు 514 మంది, వార్డు అభ్యర్థులు 1834 మంది
- 9వ తేదీ వరకు అభ్యర్థుల ఉపసంహరణలు గడువు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

పంచాయతీ ఎన్నికల్లో సోషల్ వార్ మొదలైంది. ఒకప్పుడు పంచాయతీ ఎన్నికలంటే గ్రామాల్లో నీలి రంగు, జాజిరంగులతో అభ్యర్థుల పేర్లు, గుర్తులు, అభివృద్ధి నినాదాలతో గోడలన్నీ నింపేవారు. ఎన్నికల కమిషన్ నిబంధనలతో గోడరాతలకు కాలం చెల్లింది. ఆ తర్వాత బ్యానర్లు, ఫ్లెక్సీలు గ్రామ చౌరస్తాలో సందడిగా మారినా ఎన్నికల కమిషన్‌కు ప్రతి పైసా లెక్కలు చెప్పాల్సి ఉండడంతో వాటిని తగ్గించారు. ఇక అభ్యర్థులకు అరచేతిలో ప్రచార హస్తంగా మొబైల్ ఫోన్లు మారాయి. అభ్యర్థుల ఫొటోలు, గుర్తుల డిజైన్లతో వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ ఫేస్‌బుక్‌లో చక్కర్లు కొడుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 260 సర్పంచ్ స్థానాలు, 2268 వార్డు స్థానాలకు నోటిఫికేషన్లు జారీ చేసి ఎన్నికలకు స్వీకారం చుట్టారు. మూడు విడతల్లో జరుగుతున్న ఎన్నికల్లో మొదటి, రెండో విడత అభ్యర్థుల లెక్క తేలిపోయింది. ప్రచార బాట పట్టారు.

ఇప్పటి వరకు 27 మంది సర్పంచులు ఏకగ్రీవమయ్యారు. తొలి విడతలో ఐదు మండలాల్లో 85 సర్పంచ్ స్థానాలు ఉన్నాయి. తొమ్మిది స్థానాల్లో ఏకగ్రీవం కాగా, 76 గ్రామపంచాయతీలు 295 మంది సర్పంచ్ అభ్యర్థులు, 229 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవం కాగా, 519 వార్డుల్లో 1377 మంది అభ్యర్థులు బరిలో ఉన్నాయి. రెండో విడతలో మూడు మండలాల్లో 88 సర్పంచులు, 758 వార్డు సభ్యుల స్థానాలు ఉన్నాయి. సర్పంచ్ స్థానాల్లో 11 మంది అభ్యర్థులు, 182 మంది వార్డు అభ్యర్థులు ఏకగ్రీవం కాగా, సర్పంచ్ అభ్యర్థులు 279 మంది, 1296 వార్డు అభ్యర్థులు మంది పోటీలో ఉన్నారు. తుది విడతలో నాలుగు మండలాల్లో 87 సర్పంచులు, 762 వార్డు సభ్యుల స్థానాలు ఉన్నాయి. శనివారం నామినేషన్ల పరిశీలన జరిపారు. మిగిలిన నామినేషన్లలో సర్పంచ్ స్థానాలకు 514 నామినేషన్లు, 1834 వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు వచ్చాయి. ఈనెల 9వ తేది వరకు ఉపసంహరణలకు గడువు ఉంది.

● రాజకీయ వేడి రగిలిస్తున్న సామాజిక మాధ్యమాలు

దేశ రాజకీయాలు, ఎంపీ ఎన్నికలకు పరిమితమైన సామాజిక మాధ్యమాలు ఇప్పుడు రాజన్న సిరిసిల్ల జిల్లా గ్రామ పంచాయతీ ఎన్నికల్లోను రాజకీయాలను వేడి రగిలిస్తున్నాయి. ఎలాంటి ఖర్చు లేకుండా నయా ట్రెండ్ సోషల్ మీడియా మారింది. ప్రతి ఒక్కరికి స్మార్ట్ ఫోన్‌తో పాటు వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లను ఫాలోయింగ్ అవుతున్నవారే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో సోషల్ మీడియా ట్రెండింగ్ పెరిగింది. రకరకాల రీల్స్ చేయడం గ్రామాల నుంచి ఎక్కువగా వస్తున్నాయి. పోటీలో ఉన్న అభ్యర్థులు గ్రామాల్లో వారిగా సామాజిక గ్రూపులు ఏర్పాటుచేసి పో స్టులు పెడుతూ ప్రచారం చేస్తున్నారు. ఒక్క అభ్యర్థి వాట్సాప్‌లో 20 గ్రూపుల వరకు ఏర్పాటుచేసి తమను గెలిపిస్తే చేసే పనులపై సొంత కథనాలు పోస్టులు పెడుతున్నారు. పలు సోషల్ మీడియా ఛానల్ నిర్వాహకులు ప్యాకేజీల ద్వారా పనిచేయడం మొదలు పెట్టారు. మరోవైపు ప్రధాన రాజకీయ

(మిగతా 8వ పేజీలో)

● రీల్స్ వీడియోలు.. పాటలు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొదటి, రెండో విడత గుర్తుల కేటాయింపుతో పోటీలో ఉన్న సర్పంచ్, వార్డు అభ్యర్థులు ఓటర్లను ఆకర్షించడానికి వీడియో రికా ర్డులతో రీల్స్, ఆడియో పాటలు, మాటలతో ప్రచారాలు జోరుగా సాగిస్తున్నారు. గ్రామాల్లో తాము చేయబోయే పనులు సేవా కార్యక్రమాలను ప్రజలకు తెలియజేస్తూ ప్రచారం చేస్తున్నారు. పార్టీ నాయ కులు, స్నేహితులు, బంధువులు, సన్నిహితుల ద్వారా ప్రచారం చేస్తున్నారు. వాట్సాప్ స్టేటస్ పెట్టుకునే విధంగా విజ్ఞప్తులు చేస్తున్నారు. రకరకాల కొటేషన్లు, హెచ్చరికలతో ఆడియో ప్రచారాలు చేస్తున్నారు మరోవైపు యువత డబ్బు, మద్యానికి ఓటు వేయవద్దంటూ పోస్టులు పెడుతున్నారు. పార్టీలో ఉన్న యాక్టివ్ కార్యకర్తలు తమ అభ్యర్థి తరఫున పోస్టులు పెడుతూ అదరగొడుతున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- రాష్ట్రస్థాయి ఓపెన్ కుంగ్‌ఫూ పోటీలు ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం,శారీరక దృఢత్వం లభిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో మొదటి రాష్ట్రస్థాయి ఓపెన్ కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ పోటీలను ఆదివారం జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఆటలు ఆడటం వల్ల శారీరక దృఢత్వం లభిస్తుందని తెలిపారు. ఈ ప్రాంతంలో అనేక మంది క్రీడాకారులకు నిలయంగా మారిందన్నారు. విద్యార్థులు చదువుతో పాటుగా కరాటే కుంగ్‌ఫూ పోటీలలో సైతం విద్యార్థులు రాణించాలని కోరారు. తల్లిదండ్రులు విద్యార్థులపై, క్రీడాకారులపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. పట్టుదల ఉంటే సాధించలేనిదీ ఏదీ లేదని, గెలుపుతో మురిసిపోకుండా, ఓటమితో కృంగిపోకుండా జీవితంలో రాణించడం నేర్చుకోవాలని సూచించారు. జీవితంలో వచ్చే ఆటుపోట్లను ఎదిరించే విధంగా శక్తి సామర్థ్యాన్ని పెంపొందించేలా క్రీడలు దోహదపడుతాయని కోరారు.మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం లభిస్తుందని తెలిపారు. ఎల్లప్పుడూ క్రీడాకారులకు తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని హామీచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి క్రీడలకు పెద్దపీట వేస్తున్నారని అందులో భాగంగా రాష్ట్రంలో క్రీడా యూనివర్సిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనీ క్రీడాకారులను వెలికితీయడానికి సీఎం కప్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో నిర్వహకులు లెజండరీ గ్రాండ్ మాస్టర్ వీరాచారి, అసిస్టెంట్ గ్రాండ్ మాస్టర్ నేరెళ్ల శ్రీధర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

పోరాడి హక్కులను సాధించుకుందాం

- బీసీ సంఘాల నాయకులు


సాయిఈశ్వర్‌చారికి నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బీసీల 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఆత్మహత్యలు వద్దని, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో పోరాడి రిజర్వేషన్లను సాధించుకుందాం అని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కన్వీనర్ పంతం రవి పిలుపునిచ్చారు. బీసీల 42 శాతం రిజర్వేషన్లు అమలు కాకపోవడంతో మనస్థాపంతో ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడగా సంతాపం తెలుపుతూ ఆదివారం జిల్లా కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో బీసీ సంఘాల జిల్లా నాయకులు ఆయన చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పంతం రవి, బీసీ సంఘాల జిల్లా నాయకులు మాట్లాడారు. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరని నిరసిస్తూ సాయి ఈశ్వరచారి ఆత్మహతి చేసుకున్నాడని అన్నారు. బీసీ హక్కుల కోసం సాయి ఈశ్వరచారి అమరత్వం పొందడం బాధాకరమన్నారు. పోరాటాల ద్వారానే మన హక్కులను సాధించుకోవాలని ఆత్మహత్యలు చేసుకోవడం సరైన విధానం కాదన్నారు. బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల పట్ల సవతితల్లి ప్రేమను ప్రదర్శించడం దుర్మార్గంన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభు త్వం శీతాకాలం పార్లమెంట్ సమావేశాల్లో బీసీల 42 శాతం రిజర్వేషన్ల బిల్లుపై స్పష్టమైన వైఖరిని చెప్పాలని డిమాండ్ చేశారు. సాయి ఈశ్వరచారి కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల జిల్లా నాయకులు బొజ్జ కనకయ్య, బుర్ర మల్లేశం, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గుంటి వేణు, బీసీ నాయకులు సోమ నాగరాజు, రజని, సాగర్, శ్రావణపల్లి రాకేష్, గుంద్రేటి రాజు, సబ్బని రాకేష్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలి

చందుర్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా గ్రామస్థులందరూ సహకరించాలని చందుర్తి ఎస్‌ఐ రమేష్ కోరారు. చందుర్తి మండలం లింగంపేట గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో ఎన్నికల దృష్ట్యా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు జరగకుండా పోటీ చేసే అభ్యర్థులు, నాయకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు. నాయకులు గానీ, అభ్యర్థులు గానీ ఓటర్లను ఓట్లను మాత్రమే కోరాలని ఎలాంటి బెదిరింపులకు ప్రలోభాలకు పాల్పడడం, గురి చేయవద్దని సూచించారు.

ప్రలోభాలకు గురై ఓటు వేయవద్దు

ఇల్లంతకుంట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : ఓటర్లు ప్రలోభాలకు గురయి ఓట్లు వేయవద్దని ఎస్సై సిరిసిల్ల అశోక్ సూచించారు. గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం పొత్తూరు గ్రామంలో అవగాహన సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాలలో మద్యం, డబ్బులు ఓటర్లకు పంపిణీ చేస్తే పోలీసులకు సమాచారం అందివ్వాలన్నారు. ఇతరులను కించపర్చేలా సోషల్‌మీడియాలో పోస్టులు పెడితే చట్ట రీత్య చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి పోలీంగ్‌స్టేషన్ వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తామని, ఎన్నికల నిబంధనలు ఎవరు అతిక్రమించవద్దని సూచించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ కొమురయ్యతో పాటు పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా వ్యవహరించాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్


ఫాజుల్‌నగర్ చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

వేములవాడ రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. ఫాజుల్‌నగర్ వద్ద ఏర్పాటుచేసిన ఎస్‌ఎస్‌టీ చెక్‌పోస్టును ఆదివారం ఆమె తనిఖీ చేసారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అనంతరం వాహనాల తనిఖీ రిజిస్టర్‌ను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రూరల్ సీఐ శ్రీనివాస్, పలువురు అధికారులు ఉన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

- ఎస్పీ మహేష్ బీ గీతే

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్వేచ్ఛగా, శాంతియుతంగా గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ మహేష్ బీగీతే తెలిపారు. సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ ఎన్నికల నియమావళి పాటిస్తూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బులు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకుని వెళ్లుతున్నట్లు సమాచారం ఉంటే సంబంధిత పోలీస్ స్టేషన్‌ల వారికి సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లాలో మూడు విడతల్లో గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా, ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు 800 మంది పోలీస్ సిబ్బంది సిద్ధంగా ఉన్నారన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు పాల్గొన్నారు.

మళ్లీ పెరిగిన చలి..

- మానాలలో అత్యల్పంగా 10.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు


సిరిసిల్లలో కమ్ముకున్న పొగమంచు

సిరిసిల్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చలి తీవ్రత మళ్లీ పెరుగుతోంది. ఆదివారం ఉదయం, పగటి వేళల్లో ఈదర గాలి, చలితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం వేళల్లో పొగమంచు కమ్ముకుంటోంది. జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత 10.9 డిగ్రీలు ఉండగా, గరిష్ఠ ఉష్ణోగ్రత 34.2 డిగ్రీలుగా నమోదయింది. జిల్లాలో అత్యల్పంగా రుద్రంగి మండలం మానాలలో కనిష్ఠ 10.9 డిగ్రీలుగా నమోదయింది. బోయినపల్లిలో 11.2 డిగ్రీలు, వేములవాడ రూరల్ 11.9 డిగ్రీలు, చందుర్తిలో 12.1 డిగ్రీలు, కోనరావుపేటలో 12.7 డిగ్రీలు, తంగళ్లపల్లిలో 12.8 డిగ్రీలు, గంభీరావుపేటలో 13.1 డిగ్రీలు, వీర్నపల్లిలో 13.1 డిగ్రీలు, ఇల్లంతకుంటలో 13.3 డిగ్రీలు వేములవాడలో 13.3 డిగ్రీలు, ఎల్లారెడ్డిపేటలో 13.4 డిగ్రీలు, ముస్తాబాద్‌లో 13.4 డిగ్రీలు సిరిసిల్లలో 13.9 డిగ్రీలుగా నమోదయింది.

లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో మహా పూర్ణాహుతి


మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

తంగళ్లపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం మహాపూర్ణాహు తి, పుష్పయాగం నిర్వహించారు. రథం, షెడ్డు, ప్రాణ ప్రతిష్ఠకు రూ. 10లక్షలు కావాల్సి ఉంటుందన్న పండితుడు నమిలికొండ రమణాచారి విజ్ఞప్తి మేరకు ఎగుమామిడి వెంకటరమణరెడ్డి, ఎగుమామిడి కృష్ణరెడ్డి, ఎగుమామిడి విజయేందర్‌రెడ్డి సోదరులతో పాటు కామినేని శ్రీనివాస్, శ్రీధర్ సోదరులు నిర్మాణానికి సహకారాన్ని అందిస్తామని ప్రకటించారు. అలాగే లక్ష్మీనర్సింహస్వామిని సెస్ ఛైర్మన్ చిక్కాల రామరావు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

'ఆడపిల్ల పుడితే రూ.2 వేలు'

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తనను సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామంలోని మహిళలకు ఆడపిల్ల జన్మిస్తే రూ.2వేలు మేనమామ కట్నంగా అందజేస్తానని మండలంలోని నారాయణపూర్ సర్పంచ్‌గా నామినేషన్ దాఖలు చేసిన ఓర్సు రాజేందర్ ఆదివారం ప్రకటించారు. గ్రామాభివృద్ధికి చేసే పనులకు సంబంధించిన పత్రాలను అందజేశారు.

అర్ధరాత్రి సర్పంచ్ అభ్యర్థుల గుర్తుల మార్పు


నిరసన వ్యక్తం చేస్తున్న అభ్యర్థి రవీందర్

తంగళ్లపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థుల గుర్తులు గంటల వ్యవధిలోనే మారాయి. ఆదివారం ఉప సంహరణల అనంతరం తంగళ్లపల్లి సర్పంచ్ అభ్యర్థులు ఆరుగురు బరిలో నిలవగా, ఎన్నికల సిబ్బంది పేరులోని అక్షరాల ఆధారంగా గుర్తులు కేటాయించారు. అక్షరాల ప్రకారం మొదటగా అంకారపు రవీందర్ పేరును ప్రకటించి ఉంగరం గుర్తు కేటాయించారు. ఆరవ వరసలో ఉన్న అభ్యర్థి మోర లక్ష్మీరాజం అక్షరాల ఆధారంగా కేటాయించడం లేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఎన్నికల సిబ్బంది గుర్తులను కేటాయించకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వారి సూచనలు మేరకు సాయంత్రం ఐదు గంటలకు యథావిధిగా గుర్తులను కేటాయించారు. దీంతో మోర లక్ష్మీరాజం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు గుర్తుల కేటాయింపు సరిగా లేదని ఫిర్యాదు చేశాడు. ఎన్నికల సిబ్బంది హడావుడిగా ఆదివారం అర్ధరాత్రి సర్పంచ్ అభ్యర్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. గుర్తులు కేటాయించడంలో మార్పు చేస్తున్నట్లు సమాచారం అందివ్వగా, ఆరుగురు అభ్యర్థులకు ఇద్దరు అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. మొదటి పేరు అంకారపు రవీందర్ పేరును రెండో వరసలో చేర్చి కత్తెర గుర్తును, రెండో వరసలో ఉన్న ఇటుకల మహేందర్‌ను మొదటి వరుస క్రమంలో చేర్చి ఉంగరం గుర్తు కేటాయించారు. ఎన్నికలకు తక్కువ వ్యవధి ఉండడంతో సాయంత్రం గుర్తులు కేటాయించగానే అభ్యర్థులు ప్రచారం మొదలు పెట్టారు. కరపత్రాలు సైతం ముద్రించుకున్నారు. తీరా అర్ధరాత్రి ఎన్నికల సిబ్బంది గుర్తులు మార్చ డంతో ఇద్దరు అభ్యర్థులు నష్టపోయే ప్రమాదం ఏర్పడింది.

అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతో..

అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతోనే ఎన్నికల సిబ్బంది గుర్తు మార్చారని సర్పంచ్ అభ్యర్థి అంకారపు రవీందర్ ఆరోపించారు. సోమవారం తంగళ్లపల్లి గ్రామ పంచాయతీ వద్ద రవీందర్ మాట్లాడారు. సాయంత్రం ఐదు గంటలకు గుర్తులను ప్రకటించిన ఎన్నికల సిబ్బంది అర్ధరాత్రి ఎలా మారుస్తారని ప్రశ్నించారు. గుర్తులు మార్చి తన గెలుపును అడ్డుకోవాలని అధికార పార్టీ నాయకులు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ఉంగరం గుర్తు కేటాయించి అర్ధరాత్రి కత్తెర గుర్తుకేటాయించడాన్ని తప్పుబట్టారు.

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యుడు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరు సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని సిరిసిల్ల ఆర్‌ఎంపీ, పీఎంపీ, పారామెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ డాక్టర్ కుడికాల రవికుమార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం నెహ్రూనగర్ ఆర్‌ఎంపీ, పీఎంపీ భవనంలో సిరిసిల్ల ఆర్‌ఎంపీ, పీఎంపీ పారామెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్, మెడికవర్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరంతో పాటు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ పేదల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యక్తులు గుండె పోటుకు గురైనప్పుడు ఆందోళన చెందకుండా అత్యవసరంగా సీపీఆర్ చేయాలన్నారు. గ్రామాల్లో ఆర్‌ఎంపీలు, పీఎంపీలు ఎక్కువగా అందుబాటులో ఉంటారని, వారు సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. సీపీఆర్ నేర్చుకోవడం వల్ల ఒక మనిషిని ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని అన్నారు. అందుకోసమే ఈ రోజు సిరిసిల్ల పరిధిలోని ఆర్‌ఎంపీ, పీఎంపీలకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వైద్యుడు ప్రకాష్ శిబిరంలో దాదాపు 250 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. అనంతరం ఆయన సీపీఆర్ అవగాహన కల్పిస్తూ శిక్షణ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, లక్ష్మీరాజం, ఆర్‌ఎంపీ, పీఎంపీలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



సత్తయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలో ఈనెల 3న రోడ్డుప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వృద్ధుడు నమిలికొండ సత్తయ్య(65) ఆదివారం మృతిచెందాడని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు.. గ్రామంలోని సత్తయ్య ఈనెల4న రోడ్డుపై నుంచి నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో కిష్టునాయక్ తండాకుచెందిన యువకుడు గుగులోతు విజయ్ బైక్‌తో వెనుక నుంచి ఢీకొట్టాడు. తీవ్ర గాయలపాలైన వృద్ధుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడికి భార్య చంద్రవ్వ, కొడుకులు బాబు, నర్సింలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

వివాహిత ఆత్మహత్య



రచన(ఫైల్)

కోరుట్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతాలనికి చెందిన అడెపు రచన అలియాస్ జోగల హరి (27) అనే వివాహిత ఆదివారం వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసు కుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అడెపు రచనకు మల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన జోగ రాజేష్‌తో వివాహం జరిగినట్లు తెలిపారు. దంపతులకు కూతురు జన్మించిన తరువాత అత్తిం టి వారి వరకట్నం వేధింపులతో రచన కోరుట్ల పట్టణంలోని తల్లిగారి ఇంట్లో ఉంటుంది. ఈక్రమంలో రచన మల్లాపూర్ మండలంలోని పోలీస్ స్టేషన్‌లో అత్తింటి వారిపై ఫిర్యాదు చేసింది. ఆదివారం ఉదయం ఇంట్లో నుంచివెళ్లిన రచన అదేప్రాంతంలోని వ్యవసాయబావిలోదూకి ఆత్మహత్య చేసుకున్నాట్లు వారు తెలిపారు. రచన తండ్రి అడెపు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చిరుతపులి దాడిలో ఆవు మృతి

చందుర్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం లింగంపేట గ్రామంలో చిరుతపుడి దాడిలో ఆవు మృతిచెందింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లాండే సంతోష్ అనేరైతు రోజు మాదిరిగానే పొలం వద్ద ఆవును కట్టేసి ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం రైతు పొలం వద్దకు వెళ్లి చూడగా ఆవు కనబడలేదు. చుట్టుపక్కల వెతకగా ఆవు కళేబరంతోపాటు చిరుతపులి అడుగులను గుర్తించాడు. చిరుతపులి పొలం వద్దకు ఆవును ఎత్తుకెళ్లి చంపినట్లు తెలిపారు. ఆవు విలువ దాదాపు రూ.70వేలు ఉంటుందని, బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. ఈ విషయమై అటవీశాఖ డిప్యూటీ రెంజ్ ఆఫీసర్ రాఘవేంద్రరావు మాట్లాడుతూ లింగంపేట గ్రామంలోని కొత్తకుంట శివారులో ఆవుపై చిరుతపులి దాడి చేసింది వాస్తమేనని అన్నారు. పశువైద్యాధికారులతో ఆవు కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బాధిత రైతుకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందజేస్తామన్నారు.

ముక్కిన బియ్యం తిని గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

మల్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం రామన్నపేటకు చెందిన దండిక మల్లేశం, తాడుక గంగన్నకు చెందిన 150 గొర్రెలు ముక్కిన బియ్యం తిని మృత్యువాత పడ్డాయి. శుక్రవారం నూకెల్లి సమీపంలో వ్యవసాయ పొలంలో పడేసిన ముక్కిన బియ్యం తినగా శనివారం, ఆదివారం మృతి చెందినట్లు బాధిత యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరుతున్నారు. కాగా పశువైద్యాధికారులు, రెవెన్యూ అధికారులు మృతి చెందిన జీవాలను పరిశీలించి నష్టం అంచనా వేశారు. నష్టపోయిన యజమానులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

మానకొండూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగాపూర్ శివారులో రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని వెల్దికి చెందిన పెంచాల సిద్ధార్థరావు, మడ్డి రాకేష్ ఆదివారం తెల్లవారు జామున కరీంనగర్ నుంచి గ్రామానికి కారులో వెళ్తున్నారు. లింగాపూర్ శివారులో రోడ్డుపై ఉన్న గుంతను తప్పించబోయి అదుపు తప్పి పక్కన ఉన్న చెటును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు.

సెల్‌ఫోన్‌కు రక్షణ.. సంచార్ సాథి

SANCHAR SAATHI MOBILE APP



- అనధికార సిమ్‌లు, నకిలీ కనెక్షన్లకు చెక్
- టెలికాం మోసాలకు అడ్డుకట్ట

చొప్పదండి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం పల్లెలు, పట్టణాల్లో ప్రతి ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్ ఉండడం మాములైపోయింది. ప్రతి నిత్యం సెల్‌ఫోన్‌లో అనధికార యాప్‌లతో సైబర్ మోసాలకు గురవుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సంచార్ సాథి యాప్ నకిలీలకు చెక్ పెడుతూ టెలికాం మోసాలకు అడ్డుకట్ట వేస్తోంది. ఒక పేరుపై ఎన్ని సిమ్‌లు ఉన్నాయో యాప్ ద్వారా తెలుసుకోవడమే కాకుండా మొబైల్ ఫోన్ పోయినా, దొంగలు ఎత్తుకుపోయినా బ్లాక్ చేస్తుంది ఈ యాప్.

యాప్‌తో ప్రయోజనాలు

సంచార్ సాథి యాప్ ద్వారా ఒక వ్యక్తి తన పేరుపై ఉన్న సిమ్ కనెక్షన్ల వివరాలు తెలుసుకోవచ్చు. ఒక పేరుమీద ఆధార్ కార్డుతో ఎన్ని సిమ్‌లు రిజిస్టర్ అయ్యాయో తెలుస్తుంది. మొబైల్ ఫోన్ కంపెనీ వివరాలు అసలు, నకిలీ వివరాలు తెలుస్తాయి. మొబైల్ ఫోన్ ఎక్కడైనా పోయినా, దొంగలు ఎత్తుకుపోయినా బ్లాక్ చేసుకోవచ్చు. మొబైల్‌ను బ్లాక్ చేస్తే దుర్వినియోగం కాకుండా అడ్డుకట్ట వేయవచ్చు. అనుమానాస్పద కాల్స్ ఎస్ఎంఎస్‌లను యాప్‌లో రిపోర్టు చేయవచ్చు. మొబైల్‌కు భద్రత కల్పించే విధంగా యాప్‌ను రూపొందించారు. ఈ యాప్‌ను అన్ని ప్రాంతీయ భాషల్లో ఉపయోగించవచ్చు. పోయిన ఫోన్ స్టేటస్‌ను తెలుసుకునే అవకాశం ఈ యాప్‌లో ఉంది.

- మీ పేరు మీద ఉన్న సిమ్‌లను చెక్ చేసుకోవచ్చు. దేశంలో ఎక్కడైన మీ పేరు మీద ఉన్న సిమ్‌లు ఉన్నట్లయితే వాటి వివరాలు తెలుస్తాయి.
- పై మొబైల్ కనెక్షన్ మీద క్లిక్ చేయగానే మీ ఆధార్‌పై ఇతరులు తీసుకున్న సిమ్‌లు కనిపిస్తాయి. మీ పేరుమీద ఇతరులు సిమ్ తీసుకున్నట్లయితే రిపోర్టు, డిస్ కనెక్షన్‌పై క్లిక్ చేయాలి. వెంటనే సిమ్‌పై వాడే నంబర్‌ను రద్దు చేయవచ్చు.
- ఫోన్ పోయినా, ఎవరైనా ఎత్తుకుపోయిన బ్లాక్, స్టోలెన్/లాస్ట్ డివైస్‌ను ఓపెన్ చేసి ఐఎంఈఐ నంబర్ నమోదు చేసి ఎఫ్ఐఆర్ నంబర్‌ను అప్‌లోడ్ చేయాలి. 24 గంటల్లోపు పోయిన ఫోన్ నెట్‌వర్క్ బ్లాక్ అవుతుంది. ఫోన్ వాడకుండా, దుర్వినియోగం కాకుండా ఉంటుంది. ఫోన్ దొరికిన తర్వాత అన్‌బ్లాక్ డివైస్ ఆప్షన్‌ను ఎంటర్ చేస్తే తిరిగి పనిచేస్తుంది.

యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి ఇలా...

గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్‌లో సంచార్ సాథి అని సెర్చ్ చేయాలి. డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకున్న తర్వాత మొబైల్ నంబర్‌ను ఎంటర్ చేయగాను ఓటీపీ వస్తుంది. ఓటీపీని వెరిఫై చేసిన తర్వాత డాష్‌బోర్డులో కొన్ని ఫీచర్స్ కనిపిస్తాయి. మొబైల్ కనెక్షన్స్, రిపోర్ట్ ఫ్రాడ్ కాల్స్, ఎస్ఎంఎస్, బ్లాక్ డివైస్, చెక్ లాస్ట్, ఫోన్ స్టేటస్, ట్రేస్ ఐఎంఈవో వంటి ఫీచర్లు ఉంటాయి.

రేషన్ బియ్యం పట్టివేత



రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న ఓఎస్‌డీ ప్రభాకర్

హుజూరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ఓ రైస్ మిల్లులో ఆదివారం భారీఎత్తున రేషన్ బియ్యం పట్టుకున్నారు. హుజూరాబాద్‌లో రేషన్ బియ్యం అక్రమరవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు సివిల్‌సప్లయీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు నిఘా ఏర్పాటుచేశారు. పట్టణంలోని బోర్నపల్లి శివారులోని ఓ రైస్‌మిల్లుకు ఆటోల్లో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా అధికారులు దాడులు నిర్వహించారు. ఒక్కో ఆటోలో మూడు క్వింటాళ్ల చొప్పున ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆ రైస్‌మిల్లులో తనిఖీచేయగా సుమారు 320 క్వింటాళ్ల పీడీఎస్ లూస్‌రైస్‌ను గుర్తించారు. ఈసందర్భంగా సివిల్ సప్లయీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ప్రభాకర్ మాట్లాడుతూ చిగురుమామిడి మండలంలోని పలుగ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ 12రూపాయలచొప్పున రేషన్‌బియ్యాన్ని కొనుగోలు చేసి ఎడ్ల రమేష్ అనే దళారికి విక్రయిస్తున్నారన్నారు. రమేష్ చెప్పడంతోనే రేషన్‌బియ్యాన్ని మిల్లుకు తరలిస్తున్నట్లు ఆటోయజమానులు పేర్కొన్నారన్నారు. బియ్యాన్ని రేషన్ స్టాక్‌పాయింట్‌కు తరలించామని, రైస్‌మిల్లు యజమాని, దళారులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. దాడుల్లో అధికారులు లక్ష్మారెడ్డి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

'నవోదయ'లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చొప్పదండి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నవోదయ విద్యాలయంలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యాలయ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తామన్నారు. అనంతరం పూర్వవిద్యార్థుల సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షుడిగా కేవీఎస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మధుకృష్ణ, ట్రెజరర్‌గాశ్రీనివాస్‌ను ప్రకటించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

శంకరపట్నం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కాచాపూర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. వీణవంకమండలం జంగంపల్లి(కోర్కల్) గ్రామానికి చెందినరావణావేణిసాగర్ ఇసుకరవాణా చేస్తున్నట్లు, అతడిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జమ్మికుంట రూరల్ : జమ్మికుంటలోని మడిపల్లి రైల్వేగేటు వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం పోలీస్‌లు పట్టుకున్నారు. వీణవంక మండలానికి చెందిన నవీన్, రవిని అదుపులోకి తీసుకొని, ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రామకృష్ణగౌడ్ తెలిపారు.

తిమ్మాపూర్ : మండలంలోని రేణికుంట వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పట్టుకున్నట్లు ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు, డ్రైవర్ పప్పుకృష్ణపై కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రాచర్లగొల్లపల్లిలో చోరీ



బీరువాను ధ్వంసం చేయడంతో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో భానుచందర్ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. లోనికి చొరబడిన దొంగలు బీరువాను ధ్వంసం చేసి వస్తువులను చిందరవందరగా పడేశారు. రూ.10 వేల నగదు, విలువైన పత్రాలతో పాటు రూ.80 వేల విలువైన 2 ట్యాబ్‌లు, 3సెల్‌ఫోన్లను అపహరించుకుపోయారు. భానుచందర్ ఇంటికి తాళం వేసి రెండు రోజుల కిందట తన కుటుంబ సభ్యులతో కలిసి సిరిసిల్ల వెళ్లాడు. ఆదివారం సాయంత్రం ఇంటికి చేరుకునే సరికి తాళం తీసి కనిపించింది. ఇంటిలోని బీరువాను ధ్వంసం చేయడంతో పాటు వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, వేలిముద్రణల నిపుణులు చేరుకుని నమూనాలను సేకరించారు. వేసిన తాళం పగులకొట్టకుండా తీసి చోరీ చేయడం పట్ల పోలీసులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని వివరించారు.

అక్రమంగా మొరం తరలిస్తున్న వ్యక్తుల అరెస్టు

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్‌లో ఆదివారం ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్‌చేసి టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో అదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని పోతిరెడ్డిపల్లె గ్రామ శివారులోని ప్రభుత్వ స్థలంలో నుంచి టిప్పర్‌లో మొరం నింపుకొని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని పెద్దూరు బస్టాండు వద్ద పట్టుకొని సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు. నిందితులు ఎల్లారెడ్డిపేట మండలం కిషన్‌దాస్‌పేట గ్రామానికి చెందిన బోల్లి ప్రవీణ్, సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ గ్రామానికి చెందిన మామిండ్ల జగన్‌లపై కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

రుద్రంగి చెక్‌పోస్టు వద్ద మద్యం పట్టివేత



ఇల్లందకుంటలో పట్టుకున్న మద్యాన్ని చూపిస్తున్న ఎస్ఐ క్రాంతికుమార్

రుద్రంగి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రం శివారులో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. రుద్రంగి నుంచి దెగవాత్ తండా గ్రామానికిచెందిన ఓవ్యక్తి బైక్‌పై రూ.4వేల విలువగల మద్యం తరలిస్తుండగా చెక్‌పోస్టు వద్ద అధికారులు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు వంశీ, హెడ్‌కానిస్టేబుల్ పద్మారావు తదితరులు ఉన్నారు.

మద్యం అక్రమంగా అమ్మితే కఠిన చర్యలు

ఇల్లందకుంట : ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి అక్రమంగా మద్యం అమ్మినా, నిల్వ ఉంచినా కేసులు తప్పవని ఎస్ఐ క్రాంతి కుమార్ అన్నారు. ఆదివారం నడికూడ మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామానికిచెందిన చిప్ప మనోజ్ రూ.11080విలువగల మద్యాన్ని ఇల్లందకుంట మండలం నుంచి అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. పట్టుబడిన మద్యాన్ని సీజ్‌చేసి, మనోజ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సారా పట్టివేత

ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్‌తండా, రాచర్లగొల్లపల్లి గ్రామా ల్లో 2లీటర్ల సారా, రూ.2838 విలువైన మద్యం స్వాధీనపర్చుకున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆదివారం తెలిపారు. సారా తయారుచేస్తున్న రజిత, మద్యంవిక్రయిస్తున్న షేక్‌మౌలానాపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లఘించి సారా, మద్యం అమ్మకాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.



రుద్రంగి చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న మద్యం బాటిళ్లు

శభాష్ పోలీస్..

- సామాజిక సేవలో పోలీసులు
- రోడ్డు పై ప్రమాదకరంగా ఉన్న గుంతలు పూడ్చివేత



రోడ్లపై గుంతలు పూడ్చుతున్న పెద్దపల్లి రూరల్ పోలీసులు(ఫైల్)

మంథని, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రహదారులపై గుంతలను పూడ్చుతూ మంథని పోలీసులు ప్రజలచే శభాష్ అనిపించుకుంటున్నారు... ఇటీవల వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై పోలీసులు దృష్టిసారించారు. పలుచోట్ల బ్లాక్ స్పాట్‌లను గుర్తించారు. రోడుపై గుంతలతో వాహనాలు అదుపు తప్పి కిందపడి మరణాలు, గాయాల పాలవుతున్నారు. ఒక వైపు స్థానిక సంస్థల ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించడానికి పోలీసులు నిమగ్నమవుతూనే.. మరోవైపు సామాజిక బాధ్యతగా సేవలందిస్తున్నారు. దాదాపు 10ఏళ్లక్రితం నిర్మించిన మంథని-గోదావరిఖని 26 కిలోమీటర్ల ప్రధాన రహదారిపై నిత్యం వేలాది వాహనాల రాకపోకలు సాగిస్తారు. పలు ప్రాంతాల్లో రోడ్డు మధ్య భాగాల్లో, ఇరువైపులా పక్కన గుంతలు పడ్డాయి. రోడ్డు పై లోతుగా, వెడల్పుగా పడిన గుంతల కారణంగా వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వేగంగా వచ్చి వీటిలో పడి ద్విచక్రవాహనదారులు కిందపడి గాయపడిన సందర్భాలు ఉన్నాయి. ఇటీవల గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ ఎన్నికల డ్యూటీలో భాగంగా మంథని ప్రాంతానికి వస్తున్న క్రమంలో గుంతలు గమనించి వీటి పూడ్చివేసేలా చర్యలు తీసుకోవాలని మంథని ఎస్ఐ డేగ రమేష్‌ను ఆదేశించారు. దీంతో సిబ్బందితో ఆటో ట్రాలీలో మట్టి, కంకర నింపుకొని వెళ్ళి మంథని-గోదావరిఖని ప్రధాన రహదారిపై పలు చోట్ల ఉన్న గుంతలను పూడ్చి వేయించారు. ప్రమాదాల నివారణ కోసం సామాజిక బాధ్యతగా గుంతలు పూడ్చిన మంథని పోలీసులను ఏసీపీ రమేష్ అభినందించారు.

పెద్దపల్లి - ధర్మారం వెళ్లే రహదారిలో..

పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి-ధర్మారం వెళ్లే రహదారిలో అడుగుకో గుంత ఉండటంతో పలుమార్లు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. దీంతో పోలీస్‌ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెద్దపల్లిరూరల్ ఎస్ఐ మల్లేష్ ఆధ్వర్యంలో రోడ్డుపై గుంతలు లేకుండా పూడ్చివేశారు. గత నెల16న కాసులపల్లి శివారులో ధర్మారం మండలం బొట్ల వనపర్తి గ్రామానికి చెందిన కత్తెర్ల లక్ష్మణ్ కుటుంబసభ్యులతో ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా రాత్రి వేళల్లో రోడ్డుపై ఉన్న గుంతను తప్పించబోయి వాహనం అదుపు తప్పడంతో సాయిపావని (13) తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. ప్రమదాలను నివారించేందుకు గాను పెద్దపల్లి పోలీస్ అధికారులు ముందుకొచ్చారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెద్దపల్లి - ధర్మారం వెళ్లే ప్రధాన రహదారిలో ఎస్ఐ సిబ్బందితో గుంతలను గుర్తించి పూడ్చి వేయించారు.

అతి వేగం ప్రమాదకరం

- మల్లేష్, పెద్దపల్లి రూరల్ ఎస్ఐ



వాహనదారులు వాహనాలను అతి వేగంగా నడపడం ద్వారా ప్రమాదాలు జరుగుతాయి. ద్విచక్ర వాహనదారులు మద్యం సేవించి వాహనం నడుపరాదని, హెల్మెట్ ధరించాలి. లారీలు, ట్రాక్టర్‌లు ఓవర్ లోడ్‌తో వెళ్లడం ద్వారా రోడ్లు గుంతలుగా మారుతున్నాయి. ప్రతి ఒక్కరూ గమనించి ప్రమాదాల నివారణకు సహకరించాలి.

దాడి ఘటనలో భార్యాభర్తలపై కేసు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భూవివాదంలో దాడి చేయడంతో పాటు చంపుతామని బెదిరించిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామంలోని భార్యాభర్తలు సుంకరి ప్రమీల, రాజమల్లుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆదివారం పేర్కొన్నారు. గ్రామంలోని సుంకరిమల్లయ్య పేరిటఉన్న 1.13ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తున్నాడని చెప్పారు. ఆ భూమిలో తనకు వాటా ఉందని పేర్కొంటూ అతని సోదరుడు రాజమల్లు, మరదలు ప్రమీలలు ఈనెల6న మల్లయ్య ఇంటిలోకి అక్రమంగా ప్రవేశించి దాడికి దిగారని తెలిపారు. బాధితుడి మల్లయ్య భార్య అమృతవ్వ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ వివరించారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని మహిళ తోకల లక్ష్మణ అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామంలోని తోకల నవీన్ 2017లో లక్ష్మణను ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి కొడుకు, కూతురు ఉన్నారు. లక్ష్మణ ఇంటి వద్ద బీడీలు చుడుతూ జీవిస్తోంది. ఆదివారం ఉదయం ఆమె ఇంటిలో చెప్పకుండా బయటకు వెళ్లింది. తిరిగి చేరుకోకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో ఆరాతీశారు. ఆచూకీ లభించకపోవడం వల్ల నవీన్ ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

కుంగిపోతున్న పండుటాకులు

- పిల్లల ఆదరణ కరువు
- చివరి దశలో ఆత్మహత్యలు చేసుకుంటున్న వృద్ధులు



వీణవంక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అందరూ ఉన్నా కొందరు వృద్ధులు అనాథలుగా మిగులుతున్నారు. కన్నబిడ్డలను కంటికి రెప్పల కాపాడి ప్రయోజకులను చేస్తే రెక్కలు వచ్చిన తర్వాత తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తున్నారు. మరికొందరు ఆస్తుల కోసం వేధింపులకు పాల్పడుతున్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను కంటికి రెప్పాల చూసుకోవాల్సిన కొందరు పట్టించుకోవడం లేదు. ఆస్తుల కోసం వేధింపులకు గురిచేయడం, తిండి పెట్టకపోవడం, చేయి చేసుకోవడం చివరకు చంపేందుకు వెనకాడకపోవడం వంటి ఘటనలు కుంగిపోయేలా చేస్తున్నాయి. రెక్కలు ముక్కలు చేసుకొని పిల్లలను పెంచి ప్రయోజికులను చేస్తే వృద్ధాప్యంలో పట్టెడన్నం పెట్టాకుండా మనోవేదనకు గురి చేయడాన్ని తట్టుకోలేకపోతున్నారు. కొంతమంది ఇంటినుంచి వెళ్లిపోతున్నారు. మరి కొంత మంది ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఇటీవల కాలంలో మండలంలో తరచూ వృద్ధుల బలవన్మరణాలు పెరిగిపోతున్నాయి. మండలంలోని నర్సింగాపూర్‌లో వృద్ధ దంపతులు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం సంచలనంగా మారింది. మండలంలో ఏడాదిగా పలు గ్రామాల్లో వృద్ధుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి.

చట్టాలున్నా అవగాహన లేక ఇబ్బందులు..

పండుటాకులకు సొంతబిడ్డల నుంచే వేధింపులు, నిరాదరణ ఎదురవుతుండడంతో కేంద్రం2007లో తల్లిదండ్రులు, వయోవృద్ధుల రక్షణ పోషణ చట్టం తీసుకొచ్చింది. రెవెన్యూ డివిజన్‌స్థాయిలో ట్రిబ్యునల్ ఏర్పాటు చేసింది. వృద్ధులు తమ పేరిట ఉన్న ఆస్తులను పూర్తిగా పిల్లలకు రాసి ఇచ్చాకపట్టించుకోక పోవడంతోపాటు వారిని ఇబ్బంది పెడుతు న్నారు.

అల్ట్రా మారథాన్ ఈవెంట్‌లో పాల్గొన్న సిరిసిల్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్



ఈవెంట్‌లో పాల్గొన్న ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్ అనిల్‌యాదవ్

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్- జైసల్మేర్ నుంచి లాంగెవాలా వరకు నిర్వహించిన ది బోర్డర్-2025 వంద కిలో మీటర్ల అల్ట్రా మారథాన్ రన్‌లో సిరిసిల్లజిల్లాకు చెందిన అర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్ అనిల్ యాదవ్ పాల్గొన్నారు. అత్యంత ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ఎడారి ప్రాంతంలోని వేడి, చలి తీవ్రత, ఎత్తైన ఇసుక మేటల వంటి సవాళ్ల మధ్య వంద కిలోమీటర్ల పొడవునా సాగిన ఈ రన్‌ను కానిస్టేబుల్ అనిల్ యాదవ్ 14గంటల్లో పూర్తిచేశారు. ఇటువంటి అల్ట్రా మార థాన్ ఈవెంట్‌లో పాల్గొని ఫోర్స్‌లోని యువసిబ్బందికి ఆదర్శంగా నిలిచిన అనిల్ యాదవ్‌ను ఆదివారం ఎస్పీ మహేష్ బీ గీతే అభినందించారు.

భీమన్న సన్నిధిలో నటి ఐశ్వర్య రాజేశ్ పూజలు


భీమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో హీరోయిన్ ఐశ్వర్య రాజేశ్

వేములవాడ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ భీమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం 'సంక్రాంతికి వస్తున్నాం' హీరోయిన్ ఐశ్వర్య రాజేశ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకుని అభిషేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆశీర్వచనం ఇచ్చి స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.

ఇంటి నుంచి ఓటు లేనట్లే..

- అసెంబ్లీ ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులకు అవకాశం
- పంచాయతీ ఎన్నికల్లో స్పష్టత కరువు


ఇంట్లో ఓటు వేస్తున్న వృద్ధురాలు (ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):రెండేళ్ల క్రితం నిర్వహించిన శాసన సభ, లోక్ సభ ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులకు ఎన్నికల సంఘం ఇంటి వద్ద నుంచి ఓటు వేసే అవకాశాన్ని కల్పించింది. నడవలేని, చేతగాని, మంచానికే పరిమితమైన వృద్ధులు పోలింగ్ కేంద్రానికి వెళ్లలేక పోవడంతో వారు తమ ఓటు హక్కును వినియో గించుకోలేకపోతున్నారు. ఫలితంగా ఓటింగ్ శాతం తగ్గుతోంది. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల సంఘం అటువంటి వారికి ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పించింది. కానీ ప్రస్తుతం జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో మాత్రం అలాంటి అవకాశం ఇవ్వలేదు. సర్పంచ్, వార్డు సభ్యులకు ఓటు వేసేందుకు దివ్యాంగులు, వృద్ధులు ఇంటి వద్ద నుంచి ఓటు వేసే అవకాశం కోసం ఎదురుచూ స్తున్నా ఎన్నికల సంఘం నుంచిఅలాంటి ప్రకటన రాలేదు.

● గత ఎన్నికల్లో ఇలా

గతంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటరు జాబితాలో పేరుండి 85 ఏళ్లకు పైబడిన వృద్ధులు, 45 శాతానికి పైగా వైకల్యం ఉన్నవారు ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకునే వెసులుబాటు కల్పించారు. ఇందుకు ప్రత్యేకంగా 12-డీ ఫారాన్ని ముందస్తుగానే నింపి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. వారు ఇచ్చిన అడ్రస్‌కు పూర్తి స్థాయి భద్రత, పోలింగ్ సామగ్రితో వెళ్లి అధికారులు ఓటు వేయించారు.

● ఇబ్బందులు పడే అవకాశం

ప్రస్తుత గ్రామపంచాయతీ ఎన్నికలో ఇంటి వద్ద నుంచి ఓటు వేసే అవకాశం లేకపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు కచ్చితంగా పోలింగ్ కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది. పోలింగ్ సమయం కూడా ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాత్రమే ఉంటుంది. నిర్ణీత సమయం లోపు కుటుంబ సభ్యులు వారిని పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లి ఓటు వేయించాలి. కాదూ అని వారిని వదిలేస్తే ఓటింగ్ శాతం తగ్గి గెలుపు, ఓటములపై ప్రభావం పడే అవకాశం లేకపోలేదు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులతోపాటు ఓటర్లు సైతం ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

వృద్ధులకు అవకాశం కల్పించాలి..


- కరిమిండ్ల దేవయ్య, కనుకులగిద్దె.

నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఇంటి వద్ద నుంచే ఓటు వేసేలా అధికారులు అవకాశం కల్పించాలి. వృద్ధులు, దివ్యాంగులు పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అలాంటి వారిని అధికారులు గుర్తించి అవకాశం కల్పించాలి.

లైన్‌లో నిల్చోలేం..


-దార రాధమ్మ, జూపాక

పంచాయతీ ఎన్నికల్లో ఓటేసేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లి గంటల తరబడి అక్కడ నిలబడలేం. అంత దూరం నడుచుకుంటూ వెళ్లాలన్నా ఇబ్బందే. అధికారులు స్పందించి ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం కల్పించాలి.

భీమన్న సన్నిధిలో అభివృద్ధి పనులు పరిశీలన

- అధికారులకు పలు సూచనలు చేసిన విప్ ఆది శ్రీనివాస్


ఆలయంలో భక్తులతో మాట్లాడి సమస్యలను తెలుసుకుంటున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన శ్రీభీమేశ్వరస్వామిని ప్రభుత్వవిప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పరిసరాల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించి భక్తులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన కోడె క్యూలైన్లు, సిసి రోడ్డు, క్యూలైన్ ఫ్లైఓవర్, ఉచిత దర్శనం క్యూలైన్, ప్రత్యేక దర్శనం క్యూ లైన్, వీఐపీ రోడ్డు, పార్వతీపురం ధర్మశాల రోడ్డు, లడ్డు కౌంటర్, అలాగే కొత్తగా ఏర్పాటు చేస్తున్న షాపులు పలు ప్రదేశాలను పరిశీలించారు.

రైల్వే గేట్ వద్ద రహదారిపై గుంతలు

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


పూడూర్ రైల్వే గేట్ దగ్గర రహదారిపై ఏర్పడిన గుంత

కొడిమ్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని పూడూర్ రైల్వేగేట్‌కు సమీపంలో రోడ్డుపై ఇరువైపులా గుంతలు ఏర్పడటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పూడూర్ గ్రామం కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై ఉన్నది. కొడిమ్యాల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు, జగిత్యాల జిల్లాలోని మేడిపెల్లి, కథలాపూర్, కోరుట్లకు చెందిన వారు కరీంనగర్‌కు వెళ్లాలంటే మండలకేంద్రంనుంచి అప్పారావుపేట, పూడూర్ గ్రామాల మధ్యఉన్న పూడూర్ రైల్వే గేట్‌పైనుంచి రాకపోకలు సాగిస్తుంటారు. జగిత్యాల నుంచి వేములవాడకు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. రైల్వేగేట్‌కు ఇరువైపులా ఏర్పడిన గుంతలను సంబంధిత అధికారులు పూడ్చి వేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

స్టోరీస్ ఫ్రమ్ ఇండియా-6 ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సభ్యులు

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన కవులు సబ్బని లక్ష్మీనారాయణ, సంకెపెల్లి నాగేంద్రశర్మ ఆంగ్లంలో రచించిన కథల సంకలనం స్టోరీస్ ఫ్రమ్ ఇండియా-6 పుస్తకాన్ని ఆదివారం సాయంత్రం హైదరాబాద్ బిర్లా సైన్స్‌సెంటర్ బాస్కర ఆడిటోరియంలో ఆవిష్కరించారు. ఈ కథా సంకలనాన్ని యుకియోటో అంతర్జాతీయ ప్రచురణల సంస్థ ప్రచురించింది. ఇందులో అఖిల భారత స్థాయిలో వివిధ రాష్ట్రాలకు చెందిన 18మంది కవుల, రచయితల కథలు, కవితలు కూడా ఉన్నాయి. ఈసందర్భంగా కరీంనగర్ అరబిందో సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కోల అన్నారెడ్డి, ఉప్పల రామేశం, సాయినగర్ వెల్ఫేర్‌సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు బొజ్జ రాజు, ఎస్ సురేందర్‌రెడ్డి, పీవీ సాహిత్య పీఠం అధ్యక్షుడు కేవీ సంతోష్ బాబు, పీఆర్టీయూ తెలంగాణ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, ఉపాధ్యాయులు చిందం రమేశ్, వెల్మల జయపాల్‌రెడ్డి, బొమ్మ కల్ రైతుసంఘం నాయకుడు కె నారాయణ రెడ్డి తదితరులు అభినందనలు తెలియజేశారు.

పైపులైన్ లీకేజీకి.. మరమ్మతు చేయరూ..


జగ్గయ్యపల్లిలో రోడ్డు పక్కన లీకవుతున్న పైప్‌లైన్

మానకొండూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామంలో తాగునీటి పైపులైన్ లీకేజీతో నీరు వృథా అవుతోంది. మానకొండూర్-వేగురుపల్లి ప్రధాన రహదారి జగ్గయ్యపల్లిలోని రోడ్డు పక్కన తాగునీటి పైపులైన్ లీకేజీ సమస్య ఏర్పడింది. దీంతో నీరు కలుషితమవుతోందని, వృథాగా పోతోందని గ్రామస్థులు వాపోతున్నారు. మరో వైపు పైపులైన్ మరమ్మతు కోసం గుంతను తవ్వి వదిలేశారు. గుంత రోడ్డు పక్కనే ఉండడంతో రాత్రి వేళల్లో ఆర్టీసీ బస్సు వచ్చే సమయంలో ద్విచక్ర వాహనం రోడ్డు పక్కకు దిగితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని, పైపులైన్‌కు మరమ్మతు చేపట్టాలని, గుంతను పూడ్చివేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కరీంనగర్ చిత్రకారుడికి అభినందనలు


మహానటి సావిత్రి కూతురు విజయ ఛాముండేశ్వరికి సావిత్రి చిత్రాన్ని అందజేస్తున్న రాపర్తి వెంకటేశం

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన నంది అవార్డు గ్రహీత, ఉపాధ్యాయుడు, రంగస్థల కళాకారుడు, గాయకుడు రాపర్తి వెంకటేశంను మాజీ రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మహానటి సావిత్రి కుమార్తె విజయ ఛాముండేశ్వరి అభినందించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో శనివారం రాత్రి సావిత్రి 90వ జయంత్యుత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడికి, విజయఛాముండేశ్వరికి వెంకటేశం తన స్వహస్తాలతో గీసిన వారి చిత్రపటాలను బహూకరించారు. కరీంనగర్ కళాకారుడికి ఓ గొప్ప కళావేదికపై అరుదైన గౌరవం దక్కిందని రాష్ట్ర విశ్రాంతప్రభుత్వ ఉద్యోగుల సంఘం, కరీంనగర్ యూనిట్ సభ్యులు, పలువురు కళాకారులు అభినందనలు తెలిపారు.

ఘనంగా మల్లికార్జున స్వామి జాతర


గొల్లపల్లిలో ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు


మెట్లచిట్టాపూర్‌లో బోనాలతో ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

గొల్లపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం మల్లన్నపేట మల్లికార్జునస్వామి జాతర ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో పోటెత్తింది. భక్తులు బెల్లంపానకంతో వండిన బోనాలను నెత్తిన ఎత్తుకొని ఒగ్గు పూజారుల ఢమరుక నాదాల నడుమ, శివసత్తుల పూనకాల మధ్య ఆలయం వద్దకు ఊరేగింపుగా తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మల్లికార్జున స్వామికి బోనాలు సమర్పించారు. అనంతరం క్యూలైన్‌లో గర్భగుడిలోకివెళ్లి స్వామివారిని దర్శించుకొని పసుపు, బెల్లం, బంతిపూలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు ఒగ్గుపూజారుల ఆధ్వర్యంలో మల్లన్న పట్నాలువేసి ప్రత్యేకమొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల మల్లన్ననామస్మరణలతో ఆలయ పరిసర ప్రదేశాలు ప్రతిధ్వనించాయి. ఆలయ పూజారులు కొండూరి రాజేంధర్ శర్మ, కొండూరి రఘునందన్‌శర్మ వేదమంత్రోచ్చరణల నడుమ స్వామివారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. భారీసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకోగా, ప్రత్యేక దర్శనానికి విక్రయించిన టికెట్ల ద్వారా ఆలయానికి రూ.1,75,400ఆదాయం సమకూరినట్లు ఆలయఫౌండర్‌ట్రస్టీ కొండూరి శాంతయ్య తెలిపారు. ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూలైన్‌లో భక్తులకు అసౌకర్యం కల్గకుండా ఎన్‌సీసీ విద్యార్థులు భక్తులకు ఉచిత సేవలను అందించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐలు రాంనర్సింహారెడ్డి. శ్రీనివాస్, ఎస్సైలు కృష్ణాసాగర్‌రెడ్డి, జగిత్యాల టౌన్‌ఎస్సై రవికిరణ్, సీసీఎస్సై రవీందర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. జాతర ఉత్సవాలను ఏఎంసీచైర్మన్ భీమసంతోష్, ఆలయఈవో విక్రమ్, ఆలయఫౌండర్‌ట్రస్టీ కొండూరి శాంతయ్య పర్యవేక్షించారు.

● బోనాలు సమర్పించిన భక్తులు

● మెట్లచిట్టాపూర్‌లో ఘనంగా బోనాలు..

మెట్‌పల్లి రూరల్ : మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామంలో శ్రీమల్లికార్జున బోనాలపండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం గ్రామంలోని ఆలయంలో స్వామివారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణ తదితర కార్యక్రమాలను పురోహితులు చేపట్టారు. ఈసందర్భంగా మాజీసర్పంచ్ బద్దం శేఖర్‌రెడ్డితోపాటు గ్రామాభివృద్ధికమిటీ సభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. గ్రామంలోని ప్రజలు ఇంటికి ఒకబోనంను భక్తిశ్రద్ధలతోచేసి నెత్తిన ఎత్తుకుని ఊరేగింపుగా ఆలయానికి బయలు దేరారు. బోనాల ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం బోనంతో భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి నాయకులు కుంట జనార్ధన్, మింగస్వామి, పెంట హిమాకర్, తేలు శేఖర్, దువ్వాక మురళి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

● గోదావరి వద్ద మల్లన్న భక్తుల రద్దీ..

ధర్మపురి : ధర్మపురి క్షేత్రంలోని గోదావరి నదిలో ఆదివారం మల్లన్న భక్తులరద్దీ పెరిగింది. సట్టి వారోత్స వాలను పురస్కరించుకుని గోదావరినదికిభారీగా భక్తులు తరలివచ్చారు. అనంతరం భక్తులు పవిత్ర గోదావరినదిలో స్నానాలు చేశారు. నదీజలాలతో మల్లికార్జున విగ్రహాలను శుభ్రం చేసి స్నానఘట్టాల పైన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఇసుక లింగాల వద్ద ఉంచి పూజించారు.

రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు చాంపియన్‌షిప్


చాంపియన్‌షిప్ సాధించిన ఉమ్మడిజిల్లా బాలబాలికల జట్లు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 సెపక్‌తక్రా పోటీల్లో ఉమ్మడిజిల్లా బాలురజట్టు చాంపియన్ షిప్ గెలుచుకుంది. బాలికల జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. మహబూబాబాద్ జిల్లా కురవిలో ఈనెల 4నుంచి 6వరకు 69వ రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉమ్మడికరీంనగర్ జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. అండర్-14 బాలికలజట్టు తృతీయస్థానం సాధించింది. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయపూర్‌లో ఈనెల 16నుంచి 19వ తేదీవరకు జరిగే అండర్-17 జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఉమ్మడిజిల్లా సెపక్‌తక్రా ప్రధాన కార్యదర్శి గను విజయబాస్కర్‌రెడ్డి తెలిపారు. క్రీడాకారులను జిల్లాయువజన క్రీడాశాఖ అధికారి వి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, సెపక్‌తక్రా కోచ్‌లు కుమార్, శ్రీనివాస్, సుమాన్, శ్రీకాంత్ అభినందించారు.

కేంద్ర నిధులతో ఏకగ్రీవ గ్రామాల అభివృద్ధి

- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్


పీచుపల్లి సర్పంచును సన్మానిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్రనిధులతో ఏకగ్రీవ గ్రామా లను అభివృద్ధి చేస్తామని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నికైన పీచుపల్లి, విజయ్‌నగర్‌కాలనీ సర్పంచులు సామ రాజిరెడ్డి, అమూల్య రాజశేఖర్‌రెడ్డిని సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామాలకు పదిలక్షల ప్రోత్సాహక నిధులు ఇస్తానన్నారు. కోహెడ సర్పంచ్‌గా ఎన్నికైన అమూల్యరాజశేఖర్ తనవంతుగా గ్రామ అభి వృద్ధికి రూ.9లక్షలు ఇస్తామనడం అభినందనీయమన్నారు. త్వరలోనే ఏకగ్రీవ మైన గ్రామాల్లో పర్యటించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేష్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వేములవాడకు పోటెత్తిన భక్తులు


భీమేశ్వరాలయంలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడలో భక్తులుపోటెత్తారు. ఆదివారం సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు భీమేశ్వరఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. భీమేశ్వరాలయంలో అభిషేకం, అన్నపూజ, కల్యాణం తదితర ఆర్జితసేవల్లో పాల్గొన్నారు. కోడెమొక్కును చెల్లించుకున్నారు. రాజరాజేశ్వర స్వామివారిని ఎల్‌ఈడీస్క్రీన్‌లో దర్శించుకున్నారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ..

వేములవాడ పట్టణంలోని బద్ది పోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతోరద్దీగా మారింది. భీమేశ్వర స్వామి వారిని దర్శించుకున్న అనంతరం భక్తులు బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించారు. అధికసంఖ్యలో తరలివచ్చిన భక్తులతో బద్దిపోచమ్మ ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

ఘనంగా సంకటహర చతుర్థి పూజలు


గణపతి ఆలయంలో స్వామి వారికి అభిషేకం

ధర్మపురి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద గల గణపతి దేవాలయంలో సంకటహర చతుర్థి పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేదపండితులు పాలెపు ప్రవీణ్ కుమార్ శర్మ మంత్రోచ్చరణల మధ్య పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

వేములవాడలో..

'మేడారం' భక్తుల రద్దీ షురూ

వేములవాడ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్ర జ్యోతి): మేడారం జాతరకు వెళ్లే భక్తులు వేము లవాడకు రావడం మొదలైంది. రెండేళ్లకోసారి మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర జరుగుతుంది. ఈసారి జనవరి 28 నుంచి మేడారం జాతర ప్రారంభం అవుతుంది. మేడారం వెళ్లే ముందు భక్తులు వేములవాడ రాజరాజేశ్వర స్వామికి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా మేడారం వెళ్లే భక్తులు రావడం క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రంలో విస్తరణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ఆర్జిత సేవలు, దర్శనాలు నిలిపివేసి ప్రత్యామ్నాయంగా స్వామి వారిని ఎల్‌ఈడీ స్క్రీన్‌లో దర్శించుకునేం దుకు రావిచెట్టు ఎదురుగా ప్రచార రథం వద్ద ఏర్పాటు చేశారు. అలాగే భీమేశ్వరాలయంలో ఆర్జితసేవలు, కోడె మొక్కులు చెల్లించి భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. కాగా, భక్తులకు సరిపడా తాగునీరు సరఫరా చేయాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఆలయ పరిసరా ల్లో మూత్రశాలలు ఏర్పాటు చేయాలని, వాహనాలు మిగతాప్రాంతాల్లో పార్కింగ్ చేసే విధం గా స్థలాలను కేటాయించాలని కోరుతున్నారు. సూచిక బోర్డులతోపాటు 24 గంటల దర్శనం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక


పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన సంక్షేమ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు సాకేత్, ఉమేశ్‌లు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ప్రభాకర్ ఆదివారం తెలిపారు. జిల్లా స్థాయిలో అత్యంత ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారని చెప్పారు. జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. పీడీ హన్మంతరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ముందుకు రావడం అభినందనీయం

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు ఐక్యతతో ముందుకు వచ్చి గ్రామాభివృద్ధి కోసం పాలక వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. పంచాయతీ ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్‌తో పాటు ఆరు వార్డులకు ఒకే నామినేషన్ దాఖలవడంతో ఏకగ్రీవమైన సర్పంచ్, వార్డు సభ్యులను మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం సన్మానించారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సబేరాబేగం, వైస్ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, బాబు, గౌస్, రాజేందర్, బుచ్చాగౌడ్, శ్రీనివాస్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి..

- డీఆర్డీవో శేషాద్రి


మాట్లాడుతున్న డీఆర్డీవో శేషాద్రి

తంగళ్లపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని డీఆర్డీవో శేషాద్రి అన్నారు. సోమవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని పోటీ చేస్తున్న వార్డు, సర్పంచ్ అభ్యర్థులకు ఎన్నికల నియమావళిపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ని కల నిబంధనలు పాటించాలన్నారు. అభ్యర్థి ఎన్నికల్లో చేయాల్సిన ఖర్చు, ప్రచార నిబంధనలు, పోలింగ్ ఏజెంట్లు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, పోటీ చేసే అభ్యర్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో సిరిసిల్ల విద్యార్థులు సత్తాచాటారు. ఆదివారం వేములవాడలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. జిల్లా కేంద్రానికి చెందిన సిరిసిల్ల స్పార్క్ కుంగ్‌ఫూ అకాడమి నుంచి 20 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా, 14మంది గోల్డ్, సిల్వర్, బ్రౌంజ్ మెడల్స్ సాధించారు. స్పార్క్ అకాడమీ ఆఫ్ ఇండియా గ్రాండ్ మాస్టర్ (వ్యవస్థాపక అధ్యక్షుడు) ఎంఏ హమీద్, రాష్ట్ర అధ్యక్షుడు రాజేశం విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలను అందించి అభినందించారు. అకాడమీ మాస్టర్స్ వొడ్నాల అన్నపూర్ణ, వొడ్నాల శ్రీనివాస్‌ను ప్రశంసించారు.

ఓటు వేయాలంటే.. నోటు ఇవ్వాల్సిందే..!

- బెంబేలెత్తుతున్న సర్పంచ్ అభ్యర్థులు

వేములవాడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు ఇంకా నాలుగు రోజులు మాత్రమే మిగిలి ఉంది. మొదటి విడత ఎన్నికల పోలింగ్ ఈనెల 11వ తేదిన ఉండడంతో బరిలో నిలిచే అభ్యర్థులు ప్రచారంలో నిమగ్నమయ్యారు. సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికలతో గ్రామాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. అభ్యర్థులకు ఓటు వెయ్యాలంటే నోటు, మద్యం తప్పనిసరి అన్నట్లు ఓటర్లు చూస్తున్నారు. దీంతో అభ్యర్థులకు డబ్బుల బెడద తప్పడం లేదు. మరోవైపు వార్డు సభ్యులుగా గెలిచి ఉపసర్పంచ్ పదవి దక్కించుకునేందుకు పోటీ నెలకొంది. ఉపసర్పంచ్ పదవికి చెక్ పవర్ ఉండటంతో ఆ పదవికి కూడా డిమాండ్ పెరిగింది. దీంతో అధిక శాతం వడ్డీకి డబ్బులు తీసుకువచ్చి ఖర్చు చేస్తున్నామని, ఒకవేళ ఓటమి పాలవుతే ఎలా అనే ఆందోళన అభ్యర్థుల్లో మొదలైంది. కాగా, పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు రోజు ఉదయం, సాయంత్రం ప్రచారం నిర్వహించేందుకు ఒక్కో వ్యక్తికి రూ.300 ఇస్తున్నారని తెలుస్తోంది. ఉదయం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ఓట్లు అభ్యర్థించాలి. ప్రచారం పూర్తి అయిన తర్వాత భోజనం ఏర్పాటు చేస్తున్నారు. మళ్లీ సాయంత్రం మరో అభ్యర్థికి ప్రచారానికి వెళ్లి రూ.300 వసూలు చేస్తున్నారు. ఇలా రోజుకు రూ.600 సంపాదిస్తున్నట్లు తెలుస్తోంది.

పల్లెల్లో మొదలైన వరి నాట్లు


వరి నారును తీస్తున్న వలస కూలీలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండల కేంద్రంతో పాటు రాచర్లతిమ్మాపూర్, గుండారం, వెంకటాపూర్, హరిదాస్‌నగర్, పదిర తదితర గ్రామాల్లో వరినాట్లు మొదలయ్యాయి. కూలీల కొరత వల్ల ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి కూలీలు వలస వచ్చి వ్యవసాయ పనుల్లో సాగుతున్నారు. మండలంలోని గ్రామాల్లో రైతులు సుమారు 13 ఎకరాల విస్తీర్ణంలో వరి పంటను సాగు చేయనున్నారని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

గుబులు పుట్టిస్తున్న పొదలు..


గంభీరావుపేట-నర్మాల గ్రామాల మధ్య రోడ్డు పక్కన పొదలు

గంభీరావుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల కేంద్రం నుంచి నర్మాల వెళ్లే ప్రధాన రహదారి వెంట ఉన్న పొదలు గుబులు పుట్టిస్తున్నాయి. రోడ్డుకు రెండు వైపులా ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు, ముళ్ల పొదలు వాహనదారులకు ఇబ్బందిగా మారుతున్నాయి. మూల మలుపుల వద్ద ఉన్న పొదలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్ల కొమ్మలను, ముళ్ల పొదలను తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరారు.

పగుళ్లు చూపుతున్న సీసీ రోడ్లు


వెంకటాద్రి చెరువు కట్టపై పగుళ్లు చూపిన సీసీ రోడ్డు

గంభీరావుపేట, డిసెంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల కేంద్రంలోని వెంకటాద్రి చెరువుకట్టపై వేసిన సిమెంటు రోడ్డు అప్పుడే పగుళ్లు చూపుతోంది. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, క్యూరింగ్ సరిగా చేయకపోవడం వల్లే అనతి కాలంలోనే సీసీ రోడ్లు పాడవుతున్నాయి. మండల కేంద్రం నుంచి గంగమ్మ ఆలయం వరకు వేసిన సీసీ రోడ్డు పగుళ్లు చూపి శిథిలమవుతోంది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరించడం వల్లే సీసీ రోడ్ల పరిస్థితి ఈ విధంగా తయారవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

- సీఐ వెంకటేశ్వర్లు - చందుర్తి, రుద్రంగిల్లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్


చందుర్తిలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు


రుద్రంగిలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు

చందుర్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. చందుర్తి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఎస్పీ మహేష్ గీతే ఆదేశాల మేరకు పోలీసులు ఫ్లాగ్ మార్చ్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలలో భాగంగా జరిగే పోలింగ్‌కు ఓటర్లు హాజరై తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా అన్ని విధాలా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజలలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకే పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్‌లను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎవరైనా ఓటర్లను ప్రలోభ పెడుతున్నట్లు తమ దృష్టికి వస్తే ఎన్నికల నియమావళి ప్రకారం వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరైనా ప్రవరిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫ్లాగ్ మార్చ్‌లో ఎస్‌ఐలు జిల్లా రమేష్, బి. శ్రీనివాస్‌లు, జిల్లా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకే..

రుద్రంగి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణకే ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు చందుర్తి సర్కిల్ సీఐ వేంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఏన్నికల సంద ర్భంగా రుద్రంగి మండల కేంద్రంలో సాయంత్రం జిల్లా పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలతో అంబేద్కర్ చౌరస్తా నుంచి ఇందిరాచౌక్, గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

ఎవరైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు శ్రీనివాస్, రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

కథలాపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్టు ఎంపీడీఓ శంకర్‌నాయక్ తెలిపారు. మండలంలో 37,724 మంది ఓటర్లు ఉండగా బ్యాలెట్ పేపర్లు సిద్ధం చేశామని పేర్కొన్నారు. 226 మంది ప్రిసైడింగ్ అధికారులు, 8 మంది రూట్ ఆఫీసర్లు, నలుగురు జోనల్ అధికారులు, 23 మంది స్టేజ్ 2 ఆఫీసర్లతో పోలింగ్ నిర్వహించనున్నామని తెలిపారు. చింతకుంటలో 3 కెమేరాలతో వెబ్ కాస్టింగ్ నిర్వహించాలని ఎన్నికల సంఘం నిర్ణయించిందని పేర్కొన్నారు. 188 వార్డులకు గాను సర్పంచ్ సహా 3 వార్డులు ఏకగ్రీవమైన నేపథ్యంలో 185 వార్డులకు 18 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. దివ్యాంగుల కోసం వీల్ చైర్‌లను సమకూర్చన్నాయని పేర్కొన్నారు.

పల్లెల్లో ప్రచార సందడి..

కథలాపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల సమరానికి మరో నాలుగు రోజులు మాత్రమే ఉండడంతో మండలంలోని అన్ని గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ప్రచారం తారాస్థాయికి చేరుకుంది. ఇప్పటికే గల్లీల్లో ప్రచార వాహనాల మోత మోగుతుండగా అభ్యర్థులు కరపత్రాలతో ఇంటింటీ ప్రచారం నిర్వహిస్తుండడంలో నిమగ్నమయ్యారు. పలువురు అభ్యర్థులు మహిళలకు రోజుకు రూ.200లు కూలీ చెల్లిస్తూ ప్రచారం చేయించుకోవడంలో బీజీగా మారారు. ఉదయం సాయంత్రం పూట తిరిగి అభ్యర్థులు గ్రామానికి చేయబోయే పనులను వివరిస్తున్నారు. ఈ క్రమంలో పల్లెల్లో ఎటు చూసినా సందడిగా మారింది.

జోరుగా ఇంటి పన్నుల వసూళ్లు

చందుర్తి మండలంలో 70 శాతం వసూలు


చందుర్తిలో ఇంటి పన్నులు వసూలు చేస్తున్న కార్యదర్శులు

చందుర్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల పుణ్యమా అని గ్రామాల్లో పాత బకాయిలు మొత్తం క్లియర్ చేస్తున్నారు. ఒక గ్రామంలో వార్డు సభ్యులు, సర్పంచ్‌లతో సహా ఇంటిపన్నులు కడితేనే పోటీచేయడానికి అర్హులు అనే నిబంధనలు ఉండడంతో పోటీ చేసే వార్డు సభ్యులకు, సర్పంచ్‌లకు పోటి చేసేవారు తమ ఇంటిపన్నులు క్లియర్ చేశారు. అంతేకాదు వార్డు సభ్యులు ఇంటి పన్నులు సైతం సర్పంచ్‌లుగా పోటీ చేసే అభ్యర్థులు కడుతుండడం విశేషం. ఒక్కో గ్రామపంచాయతీలో వార్డు సభ్యులు మూడు నాలుగు పార్టీల నుంచి పోటీలో ఉండగా, సర్పంచ్ అభ్యర్థులు సైతం మూడు నాలుగు పార్టీల నుంచి పోటీల్లో ఉంటున్నారు. ఈ క్రమంలో భారీ ఎత్తుగానే ఇంటి పన్నులు వసూలు అయ్యాయి. చందుర్తి మండలంలో పలు గ్రామాల్లో వసూలైన ఇంటి పన్నుల వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపల్లిలో రూ.71955, కొత్తపేటలో రూ. 26733 వసూలు కావడంతో రెండు గ్రామాల్లో 100శాతం ఇంటి పనులు వసూలు పూర్తయ్యాయి. ఆసిరెడ్డిపల్లిలో, 129554, బండపలిలో 257629, చందుర్తిలో రూ.682589, దేవుని తండాలో రూ.27711, ఎనగల్‌లో రూ.125874, జోగాపూర్‌లో రూ. 204245, కట్ట లింగంపేట్‌లో రూ. 131246, కిష్టంపేటలో రూ. 106726, లింగంపేట్‌లో రూ.168476, మల్యాలలో రూ.490104, మర్రిగడ్డలో రూ.202828, మూడపల్లిలో రూ. 224345, నర్సింగాపూర్‌లో రూ.259552, రామన్నపేటలో రూ.108071, రామారావుపల్లిలో రూ.127124, సనుగులలో రూ.154559, తిమ్మాపూర్‌లో 82621 రూపాయల ఇంటి పన్నులు వసులయ్యాయి. మొత్తం ఇంటిపన్నుల లక్ష్యం రూ.5142812 ఉండగా ఇప్పటి వరకు రూ. 3581942 వసులుకాగా, ఇంకా రూ.1560870 పన్నులు వసూలు కావలసి ఉన్నవి. దాదాపు 70 శాతం వరకు వసూలైనట్లు ఎంపీవో ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు.

పల్లెల్లో 'సోషల్' వార్

(5వ పేజీ తరువాయి)

పార్టీల భంగపడిన అభ్యర్థులు, పార్టీలు నాయకులకు వ్యతిరేకంగా పోస్టులు పెడుతుండగా, వాటిని ఖండిస్తూ మద్దతుదారుల పోస్టులు రాజకీయ చర్చలకు దారి తీస్తున్నాయి.

గ్రూపుల్లో రాజకీయ చర్చలు

జిల్లాలో పంచాయతీ ఎన్నికల చర్చలు కూడా వాట్సాప్ గ్రూపులు వేదికగా మారాయి. కుల సంఘాలు, యువజన సంఘాలు, స్నేహితుల గ్రూపులు, మహిళల కిట్టీ పార్టీ గ్రూపులు.. ఇలా రకరకాల పేర్లతో ఏర్పడిన సోషల్ మీడియాలో ఎవరికివారు ఎవరిని గెలిపించాలంటూ చర్చలు పెడుతున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థులు పడుతున్న తీరుపై కూడా కామెంట్లు పెడుతున్నారు. దీంతో గ్రూపుల మధ్య యుద్ధ వాతావరణం కనిపిస్తోంది.

గుర్తులు గుర్తుండే విధంగా..

పోటీ చేస్తున్న అభ్యర్థులకు గుర్తులు ఓటర్లకు గుర్తుండే విధంగా చేయడమే ప్రధాన సమస్యగా ఉంది. బ్యాలెట్‌లపై పేర్లు, ఫొటోలు ఉండకపోవడంతో కొత్త గుర్తులను ప్రచారం చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. సోషల్ మీడియాతో పాటు వ్యక్తిగత ప్రచారంతో ప్రతి ఓటరును కలుస్తూ తమ గుర్తుచేరేలా ప్రచారం చేస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మూడు విడతల్లో ఈ నెల 11,14,17 తేదిలలో జరిగే ఎన్నికల్లో పోటీలో ఉండే సర్పంచ్ అభ్యర్థులకు 30 గుర్తులను, వార్డు సభ్యులకు 20 గుర్తులను ఎన్నికల సంఘం కేటాయించారు. వాటిలో ఉంగరం, కత్తెర, బ్యాట్, ఫుట్‌బాల్, లేడీస్ పర్సు, టూత్ పేస్ట్, టీవీ రిమోట్, స్పానర్, చెత్త డబ్బా, బ్లాక్ బోర్డ్, బెండకాయ, కొబ్బరి తోట, వజ్రం, బకెట్, డోర్ హ్యాండిల్, చాయ్ జల్లెడ, చేతికర్ర, మంచం, పలక, టేబుల్, బ్యాటరీలైట్, బ్రష్, బ్యాట్‌మెన్, తెరచాపతో పడవ, బిస్కెట్, ఫ్లూట్, చైన్, చెప్పులు, బెలూన్, క్రికెట్ స్టంప్స్ గుర్తులు ఉన్నాయి. వార్డు సభ్యుల అభ్యర్థులకు గౌను, గ్యాస్‌స్టవ్, స్టూల్, గ్యాస్ సిలిండర్, బీరువా, విజిల్, కుండ, డిష్ యాంటీనా, గరాటా, మూకుడు, ఐస్‌క్రీమ్, గాజు గ్లాస్, పోస్ట్ డబ్బా, ఎన్వలప్ కవర్, హాకీస్టిక్ బాల్, నెక్‌టై, కటింగ్ ప్లేయర్, పెట్టే, విద్యుత్ స్తంభం, చాయ్‌కెటిల్ గుర్తులను అభ్యర్థులకు కేటాయిస్తున్నారు. అభ్యర్థులకు నచ్చకుంటే ఓటును నోటాకు వేసే అవకాశం కూడా ఇచ్చారు.

ఉపసర్పంచ్‌ల ఎన్నిక

ఇల్లంతకుంట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఏకగ్రీవం అయిన గ్రామాలలో ఉపసర్పంచ్‌ల ఎన్నిక జరిగింది. ముస్కానిపేట గ్రామ ఉపసర్పంచ్‌గా దాసరి లావణ్య,తిప్పాపూర్ ఉపసర్పంచ్‌గా జేరిపోతుల పోల్, కేసన్నపల్లె ఉపసర్పంచ్‌గా వజ్జపల్లి శ్రీకాంత్, కిష్టరావుపల్లె ఉపసర్పంచ్‌గా కడుదల రాజయ్య, చిక్కుడువానిపల్లె ఉపసర్పంచ్‌గా చిక్కుడు సత్యం, పత్తికుంటపల్లె ఉపసర్పంచ్‌గా సింగిరెడ్డి మనోహర్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. గాలిపెల్లి, జంగమరెడ్డిపల్లె గ్రామాల్లో సర్పంచ్‌లు ఏకగ్రీవం అయిన వార్డు సభ్యుల ఎన్నికలు జరగనున్నాయి.

చంద్రంపేట చౌరస్తాలో పైప్‌లైన్ లీకేజీ

- నిత్యం ప్రమాదాలు.. భయపడుతున్న వాహనదారులు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే కరీంనగర్-సిరిసిల్ల ప్రధాన రహదారిపై తాగునీటి పైప్‌లైన్‌ల లీకేజీకి పరిష్కారం కావడం లేదు. పైప్‌లైన్ లీకేజీలతో ఏర్పడిన గుంతల్లో నీళ్లు నిండి నిత్యం ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనదారులు భయంతో వణికిపోతున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట చౌరస్తాలో కరీంనగర్-సిరిసిల్ల ప్రధాన రహదారితో పాటు కోనరావుపేట మండల కేంద్రానికి వెళ్లేందుకు అక్కడనే జంక్షన్ ఉండడంతో వాహనదారులు వాహనాలను జాగ్రత్తగా నడుపుతున్న ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతేకాకుండా చౌరస్తాలో హనుమాన్ దేవాలయం సైతం రోడ్డుపైనే ఉండడంతో అక్కడ రోడ్డు ఇరుకుగా ఉండగా, పైప్‌లైన్ గేట్ వాల్ సైతం రోడ్డుపైనే ఉంది. దీంతో వాహనాదారులు అందులో పడిపోతున్నారు. అంతేకాకుండా ఇటీవల మిషన్ భగీరథ పైప్‌లైన్‌లను వేయగా ఆ పైప్‌లైన్‌లు సైతం లీకేజీ కావడంతో నీరు వచ్చి గుంతులు ఏర్పడ్డాయి. గుంతల్లో నీళ్లు ఉండడంతో వాహనాదారులు చీకటిలో గమనించకుండా వాటిలో పడి గాయాలకు గురవుతున్నారు. ప్రమాదకరంగా ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేయాలని గ్రామస్థులు ఆర్‌అండ్‌బీ అధికారులతో పాటు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎవరు పట్టించుకోకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ప్రమాదకరంగా గుంతలను మరమ్మతులు చేయాలని వాహనాదారులు కోరుతున్నారు.

ఓపెన్ జిమ్‌లపై పట్టింపేదీ..?

- వేములవాడ పట్టణంలో మూడు ప్రాంతాల్లో ఏర్పాటు
- విరిగిపోయి దర్శనమిస్తున్న పరికరాలు

వేములవాడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణ ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లను పట్టించుకునే వారే కరువయ్యారు. మున్సిపల్ ఆధ్వర్యంలో పట్టణ ప్రజల సౌకర్యార్థం మూడు ప్రాంతాల్లో ఓపెన్‌జిమ్‌లను ఏర్పాటు చేశారు. మండల పరిషత్ ఆవరణలో, రెండో బైపాస్ రోడ్డులోని కూరగాయల మార్కెట్ సమీపంలో, జగిత్యాల బస్టాండు సమీపంలోని ప్రాంతాల్లో గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశారు. మున్సిపల్ అధికారుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పరికరాలు విరిగిపోయి దర్శనమిస్తున్నాయి. మరికొన్ని పరికరాలకు తప్పుపట్టి కనిపిస్తున్నాయి. ఓపెన్ జిమ్‌లలోని పరికరాలకు మరమ్మతులు చేయించి ఎప్పటికప్పుడు నిర్వహణను సక్రమంగా చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

రూ. 25 లక్షలతో ఏర్పాటు..

వేములవాడ పట్టణ ప్రజల సౌకర్యార్థం గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ. 25 లక్షల వ్యయంతో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్నారులు, వాకర్స్, మహిళలు వ్యాయామం చేసేందుకు అవసరమైన పరికరాలను సమకూర్చినప్పటికీ నిర్వహణ విరిగిపోయి దర్శనమిస్తున్నాయి. మండల పరిషత్ ఆవరణలో, రెండవ బైపాస్ రోడ్డులోని కూరగాయల మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో గ్రీస్ లేక కొన్ని శబ్దం వస్తున్నాయని, కొన్ని బోల్టులు ఊడిపోయాయని, మరికొన్ని పరికరాలు విరిగిపోగా పక్కన పడేసి కనిపిస్తున్నాయని మున్సిపల్ తీరుపై పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్‌లు సరైన నిర్వహణ కరువైందని వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టాలని పట్టణ వాసులు, వాకర్స్ విజ్ఞప్తి చేస్తున్నారు.


కూరగాయల మార్కెట్ వద్ద ఓపెన్ జిమ్‌లో విరిగి పడి ఉన్న పరికరం


మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మూలకు పడి ఉన్న పరికరాలు

మా దృష్టికి వస్తే బాగు చేస్తాం..

- అన్వేష్, మున్సిపల్ ఏఈ

వేములవాడ పట్టణంలో మూడుచోట్ల ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశాం. జిమ్‌లలోని పరికరాలు మరమ్మతులు చేయాల్సి ఉందని మా దృష్టికి వస్తే బాగు చేయిస్తాం. తరచూ సర్వీసింగ్ లాంటివి ఏమీ చేయడం లేదు.

మెయింటనెన్స్ సరిగా లేదు..

- శ్రీనివాస్ యాదవ్, వాకర్, వేములవాడ



వేములవాడ పట్టణంలో మండల పరిషత్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌కు నిత్యం ప్రజలు వస్తున్నారు. జిమ్‌లోని పరికరాలు సరిగా సర్వీసింగ్ చేయకపోవడంతో శబ్దం చేస్తున్నాయి. కొన్ని పరికరాలు విరిగిపోయాయి. ఇప్పటికైనా సరైన మెయింటనెన్స్ చేస్తే పట్టణ ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.